చాక్లెట్ దొంగతనం చేశాడని చితకబాదారు

సూపర్‌మార్కెట్ సిబ్బంది నిర్వాకం

ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 1 : చాక్లెట్ దొంగతనం చేశాడని బాలుడిని చితకబాదిన సంఘటన రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలో చోటు చేసుకున్నది. పోలీసుల కథనం ప్రకారం.. నల్లగొండ జిల్లా పెద్దపూర మండలానికి చెందిన ఆరూరి శివ మంచాల మండలం నోముల సమీపంలోని బీసీ వెల్ఫేర్ గురుకుల పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. మంగళవారం మధ్యాహ్నం ఇబ్రహీంపట్నంలోని మంచాల రోడ్డులోగల మెగా డీమార్ట్‌కు వచ్చాడు. అందులో చాక్లెట్ దొంగతనానికి పాల్పడ్డాడన్న నెపంతో సూపర్‌మార్కెట్‌కు చెందిన ముజాఫిర్, ఖాదీర్, చింటు, సమీర్, రాకేషన్ అనే వ్యక్తులు సదరు విద్యార్థిని గోడౌన్‌లో బంధించి చితకబాదడంతో తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న వార్డెన్‌తోపాటు అధ్యాపకులు సూపర్ మార్కెట్ యాజమాన్యంపై ఇబ్రహీంపట్నం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దాడికి పాల్పడిన ఐదుగురిని అదుపులోకి తీసుకున్నట్టు పోలీసులు తెలిపారు.

కేటీఆర్ పిటిషన్‌పై కౌంటర్ వేయండి

ఈ-కార్ రేస్ కేసులో పోలీసులకు హైకోర్టు ఆదేశం

హైదరాబాద్, ఏప్రిల్ 1 (నమస్తే తెలంగాణ): ఫార్ములా ఈ-కార్ రేస్ కేసు విచారణకు తన వెంట న్యాయవాదిని తీసుకెళ్లేందుకు పోలీసులు అనుమతించడంలేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ కేసు దర్యాప్తులో భాగంగా జనవరి 9న విచారణకు హాజరు కావాలని జనవరి 6న ఏసీబీ సెంట్రల్ ఇన్వెస్టిగేషన్ యూనిట్ డీఎస్పీ తనకు నోటీసులు జారీ చేశారని, ఆ విచారణకు తన వెంట న్యాయవాదిని అనుమతించాలని కోరడంతో పోలీసులు నిరాకరించారని పేర్కొన్నారు. దీంతో ఆ పిటిషన్‌పై కౌంటర్ దాఖలు చేయాలని జస్టిస్ కే లక్ష్మణ్ మంగళవారం పోలీసులను ఆదేశించారు. విచారణను 21కి వాయిదా వేశారు.

రాజకీయ కక్షతోనే

నాభర్తను కడతేర్చారు!

- కేసీఆర్, బీఆర్ఎస్ అంటే ఆయనకు ప్రాణం
- ఎవరు విమర్శించినా సహించేటోడు కాదు
- ఆయన వైఖరి మింగుడుపడకే హత్యచేసిర్రు
- నా భర్తను లేకుండా చేసినోళ్లని శిక్షించాలి
- భూమిలేదు, సొంతిల్లూ లేదు.. ఆదుకోండి
- హత్యకు గురైన హరిసింగ్ భార్య పిఫ్లిబాయి ఆవేదన

కల్లేర్ మండలం కొత్త చెరువు తండాలో తన ఇంటి వద్ద కుటుంబ సభ్యుల మధ్య భర్త హరిసింగ్ ఫొటో పట్టుకొని రోదిస్తున్న పిఫ్లిబాయి

సంగారెడ్డి, ఏప్రిల్ 1(నమస్తే తెలంగాణ): సంగారెడ్డి జిల్లా కల్లేర్ మండలం కొత్త చెరువుతండాలో బీఆర్ఎస్ కార్యకర్త విస్లావత్ హరిసింగ్ (50) హత్యతో ఉద్విగ్న వాతావరణం నెలకొన్నది. సోమవారం ఆయన అంత్యక్రియలు జరిగాయి. మంగళవారం హరిసింగ్ ఇంటిచుట్టూ తండావాసులు, బంధుమిత్రులు కిక్కిరిశారు. భార్య పిఫ్లిబాయి కంటికి మింటికి ఏకధాటిగా రోదిస్తున్నది. పిల్లలు రేణుక, సునీత, సురేఖ, లత, కొడుకు రాంచరణ్ తల్లి చుట్టూ చేరి తండ్రిని గుర్తుచేసుకుంటూ విలపిస్తుంటే అక్కడున్న వారి కళ్లల్లో కన్నీటిధారలు కట్టాయి. ఈ సందర్భంగా పిఫ్లిబాయితో 'నమస్తే తెలంగాణ' ప్రతినిధి మాట్లాడితే తనలోని ఆవేదనను, ఆగ్రహాన్ని ఇలా తెలిపింది. ఆమె తెలిపిన విషయాలు ఆమె మాటల్లోనే.. 'తండాలో రెక్కాడితేనే డొక్కాడని గిరిజన కుటుంబం మాది. నా భర్త కూలిపనులు చేస్తుండగా నేను సామాజిక ఆరోగ్య కేంద్రంలో సహాయకురాలిగా పనిచేస్తున్నా. మాకు సొంతిళ్లు లేదు, భూమీ లేదు. రోజూ కష్టపడితేనే కంచంలోకి బువ్వ వస్తుంది. నేను, నాభర్త కష్టపడి ఐదుగురు పిల్లలను సాకాము. ఇప్పుడు రోజూ గ్రామం నుంచి దూరంగా ఉన్న కల్లేర్‌కు వెళ్లి ఇద్దరం కూలిపనులు రోజులు గడుపుతున్నాం. ఎంతో కష్టపడి నలుగురు బిడ్డల పెళ్లిళ్లు చేశాం. ఉన్న ఒక్క కొడుకును కష్టపడి చదివిస్తున్నం. మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి వెంట తిరిగే టోడు. కల్లేర్‌లో, కొత్తచెరువు తండాలో పార్టీ ఏ మీటింగ్ పెట్టినా పాల్గొనేటోడు.

కేసీఆర్, బీఆర్ఎస్ అంటే ప్రాణం

నా భర్త హరిసింగ్‌కు కేసీఆర్, బీఆర్ఎస్ అంటే ప్రాణం. గ్రామంలో అందరికీ కేసీఆర్, బీఆర్ఎస్ గొప్పదనం గురించి చెప్పేవాడు. కేసీఆర్, బీఆర్ఎస్ పార్టీని ఎవరైనా విమర్శిస్తే సహించేవాడు కాదు. వాళ్లకు సరైన సమాధానం ఇచ్చేటోడు. బీఆర్ఎస్‌ను విమర్శించే అధికార పార్టీ నాయకులు, కార్యకర్తలకూ దీటైన సమాధానం ఇచ్చేవాడు. ఈ వైఖరి కొత్త చెరువు తండాతోపాటు సమీప తండాల్లోని కొంత మంది అధికారపక్ష నాయకులకు నచ్చక ఆయనతో గొడవకు దిగిన సందర్భాలూ ఉన్నాయి.

పండుగ రోజున..

ఉగాది పండుగరోజైన ఆదివారం ఎప్పటిమాదిరిగానే నేను దవాఖానలో పనిచేసేందుకు వెళ్లాను. హరిసింగ్‌కు కూడా కొత్తచెరువు తండా నుంచి కల్లేర్ బయలుదేరిండు. మార్గ మధ్యంలో దవాఖానకు వచ్చి ఇయ్యాళ తొందరగ వెళ్లి పనులు చేసుకో అని చెప్పిండు. నేను డ్యూటీ నుంచి ఇంటికి వెళ్తుండగా, కల్లేర్‌లో కొంత మందితో హరిసింగ్ కనిపించిండు. ఎప్పటిలాగే సాయంత్రం వరకు ఇంటికి వస్తాడని నేను వెళ్లిపోయాను. రాత్రి 10 గంటల వరకు ఎదురుచూసినా ఆయన రాలేదు. మేమంతా భయపడ్డం. కల్లేర్‌లో ఉండి పొద్దున్నే వస్తడేమో అనుకున్నం. తెల్లారాక ఆయన మృతదేహం గ్రామశివారులో ఉన్నట్టు తండావాసుల ద్వారా తెలిసింది. అక్కడ చూస్తే హరిసింగ్ మెడమట్టూ తువ్వాల చుట్టి ఉన్నది. శరీరంపై గాయాలున్నాయి. నా భర్తను హత్య చేశారని బంధువులు చెప్పడంతో కుప్పకూలిపోయిన. ఎవ్వరికీ హానిచేయని నాభర్త హత్యకు గురయ్యాడని తెలిసి గుండెపగిలిపోయింది. హత్యచేసిన వాళ్లను శిక్షించే వరకు మృతదేహాన్ని కదలనిచ్చేది లేదని అక్కడే ఉన్నం. రాజకీయ కక్షతోనే నా భర్తను హత్య చేశారని అర్థమైంది. బీఆర్ఎస్‌కు మద్దతుగా నిలవడం, అధికార పార్టీ తప్పులను ఎండగడుతున్నందుకే కక్ష పెంచుకొని హత్య చేశారు. అనుమానం ఉన్న ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసి విచారణ జరపాలని పోలీసులను కోరాం.

నన్ను, నాబిడ్డను ఆదుకోవాలి

నా భర్త హరిసింగ్ పోయాక నాకు దిక్కుతోచడం లేదు. పదో తరగతి చదువుతున్న కొడుకు రాంచరణ్ ఉన్నాడు. నలుగురు ఆడపిల్లలు ఉన్నారు. ఐదుగురు పిల్లలు మా నాన్న ఏడని, మాకు దిక్కెవరని ఏడుస్తున్నారు. భూములు, ఆస్తులు, సొంత ఇల్లు లేని మేము దిక్కులేని వాళ్లమయ్యాం. మా కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకోవాలని ప్రభుత్వాన్ని, బీఆర్ఎస్ పార్టీని కోరుతున్నా. ఇల్లు కట్టించి ఆదుకోవాలని, ప్రస్తుతం పనిచేస్తున్న దవాఖానలో పర్మినెంట్ చేసి ఉద్యోగం ఇవ్వాలని ప్రభుత్వాన్ని వేడుకుంటున్నా.

రైతు భరోసాకు ఇంకెన్ని వాయిదాలు?

- సర్కారు చెప్పిన మార్చి 31 గడువు ఏమైంది?
- అన్నదాతలను ఇంకెన్నిసార్లు మోసం చేస్తరు?
- దసరా, సంక్రాంతి.. ఉగాది కూడా పోయింది
- రైతులను అన్నితీర్లా దగా చేస్తున్నసీఎం రేవంత్
- నిప్పులు చెరిగిన మాజీ మంత్రి హరీశ్‌రావు

రైతులను ఎన్నిసార్లు మోసగిస్తవ్ రేవంత్?

హైదరాబాద్, ఏప్రిల్ 1 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో రైతులకు రైతు భరోసా ఇచ్చేదాకా రేవంత్ సర్కారును వెంటాడుతామని మాజీ మంత్రి హరీశ్‌రావు హెచ్చరించారు. మార్చి 31 కల్లా రైతు భరోసా అందిస్తామని కాంగ్రెస్ పెట్టిన గడువు ఏమైందని ప్రశ్నించారు. చేసిన వాగ్దానాలను తుంగలో తొక్కడం, మాటిచ్చి మోసం చేయడం, నాలుక మడతేయడం సీఎం రేవంత్‌రెడ్డికి అలవాటుగా మారిందని మంగళవారం ఎక్స్ వేదికగా ఎద్దేవాచేశారు. మార్చి 31 కల్లా రైతు భరోసా డబ్బులు రైతులందరి ఖాతాల్లో వేస్తామని గత జనవరి 26న గొప్పగా ప్రకటించారని, మొన్నటి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లోనూ మార్చి 31 నాటికి రైతులందరికీ భరోసా డబ్బులు ఇస్తామని చెప్పారని గుర్తుచేశారు. రేవంత్‌రెడ్డి మాటలు ఘనంగా.. చేతలు హీనంగా ఉన్నాయని దెప్పిపొడిచారు. మాటలు కోటలు దాటితే..అడుగు గడప దాటడం లేదని విమర్శించారు. ముఖ్యమంత్రి మాటలను నమ్మి ఉగాది వేళ ఆశగా ఎదురు చూసిన రైతులకు చేదు అనుభవమే ఎదురైందని వాపోయారు. 'దసరాకు ఇస్తమన్నరు.. ఇవ్వలేదు. సంక్రాంతికి ఇస్తమన్నరు.. ఇవ్వలేదు. ఉగాదికి ఇస్తమని ఊరించి చివరికి రైతులను ఉసూరు మనిపించిండ్రు.. కొత్త సంవత్సరం రైతులకు చేదు అనుభవాన్నే మిగిల్చింది. ఈ ప్రభుత్వం రైతు వ్యతిరేకి' అని హరీశ్ తూర్పారపట్టారు. 'రైతులను ఇంకా ఎన్నాళ్లు మోసం చేస్తవ్ రేవంత్‌రెడ్డీ' అని మండిపడ్డారు. కేసీఆర్ హయాంలో నాట్ల సమయంలో రైతు బంధు ఇస్తే, రేవంత్ రెడ్డి కోతల నాటికి కూడా రైతు భరోసా ఇవ్వడం లేదని దుయ్యబట్టారు. మోసమే తన విధానంగా మార్చుకున్న రేవంత్‌రెడ్డి.. రైతులను అన్ని విధాలుగా దగా చేస్తున్నాడని నిప్పులు చెరిగారు. 'ఇందిరమ్మ ఆత్మీయ భరోసా అడుగు ముందుకు పడుతలేదు.. డేట్లు మాత్రం మారుతున్నయి.. డెడ్‌లైన్లు మారుతున్నయి తప్ప రైతులకు ఇచ్చిన హామీలను మాత్రం సర్కారు నెరవేర్చడం లేదు' అని విమర్శించారు. రుణమాఫీ చేసేదాకా.. రైతు భరోసా ఇచ్చేదాకా ప్రభుత్వాన్ని బీఆర్ఎస్ వెంటాడుతూనే ఉంటుందని, ఎక్కడికక్కడ నిలదీస్తూ, వైఫల్యాలను ప్రజాక్షేత్రంలో ఎండగడుతూనే ఉంటుందని హెచ్చరించారు.

కాంగ్రెస్ నాయకుడి ఫామ్‌హౌస్‌కు రోడ్డు!

- డీఎంఎఫ్‌టీ నిధులు రూ.60 లక్షలు దుర్వినియోగం?
- కాంగ్రెస్ సర్కార్ తీరుపై సర్వత్రా విమర్శలు

కాంగ్రెస్ నాయకుడి ఫామ్‌హౌస్‌కు వేసిన సిమెంట్ రోడ్డు

తాండూరు, ఏప్రిల్ 1: ప్రభుత్వ నిధులతో కాంగ్రెస్ నాయకుడి ఫామ్‌హౌస్‌కు రోడ్డు వేయడం విమర్శలకు దారితీసింది. ఈ ఘటన వికారాబాద్ జిల్లా తాండూరులో చోటుచేసుకున్నది. తాండూరులోని 11వ వార్డుల్లో కోకట్ గ్రామ పంచాయతీ డీఎంఎఫ్‌టీ రూ.60 లక్షల నిధులతో కాంగ్రెస్ నాయకుడి ఫాంహౌస్‌కు సీసీ రోడ్డు వేశారు. డీఎంఎఫ్‌టీ నిధులు పట్టణ అవసరాలకు కాకుండా కొందరు వ్యక్తులు, అనుమతి లేని వెంచర్ల యాజమాన్యాలకు లబ్ధి చేకూర్చేలా పనులు చేపడుతున్నారనే ఆరోపణలున్నాయి. కోకట్ పంచాయతీతోపాటు తాండూరులోని అనేక వార్డుల్లో సీసీ రోడ్లు లేక ఇబ్బందులు పడుతుంటే పాలకులు ఇలా ప్రజా సొమ్మును దుర్వినియోగం చేస్తున్నారని విమర్శిస్తున్నారు. ఎమ్మెల్యేతోపాటు సంబంధిత అధికారులు వెంటనే ఈ స్థలాన్ని పరిశీలించి ప్రభుత్వ నిధులు దుర్వినియోగం కాకుండా చర్యలు తీసుకోవాలని వార్డు ప్రజలు కోరుతున్నారు.

ఇందిరమ్మ ఇండ్లా.. కట్టినప్పుడు చూద్దాం..!

మంత్రి పొంగులేటి

హైదరాబాద్, ఏప్రిల్ 1 (నమస్తే తెలంగాణ): ఇందిరమ్మ ఇండ్లపై రాష్ట్ర గృహనిర్మాణం, రెవెన్యూ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి విస్మయం కలిగించే సమాధానం ఇచ్చారు. హెచ్‌సీయూ నుంచి స్వాధీనం చేసుకున్న 400 ఎకరాల్లో ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లను కట్టి ఇస్తుందా అని విలేకరులు ప్రశ్నించగా.. 'ఎక్కడివి ఇందిరమ్మ ఇండ్లు.. కట్టినప్పుడు చూద్దాం' అని చెప్పి విలేకరుల సమావేశం నుంచి నిష్క్రమించారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్‌బాబుతో కలిసి మంగళవారం పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి విలేకరుల సమావేశంలో పాల్గొన్నారు.

తెలంగాణలో ఏపీ కంటే తక్కువ పెన్షన్లు

- ధనిక రాష్ట్రమైనా పింఛన్ పెంచలేదు
- రూ.10 లక్షల కోట్ల అప్పున్నా సంక్షేమ పథకాలు అమలు
- ఏపీ సీఎం చంద్రబాబు

హైదరాబాద్, ఏప్రిల్ 1 (నమస్తే తెలంగాణ): తెలంగాణ కంటే ఆంధ్రప్రదేశ్‌లో పెన్షన్లు అధిక మొత్తంలో చెల్లిస్తున్నామని ఏపీ సీఎం చంద్రబాబునాయుడు చెప్పుకొచ్చారు. ఏపీ కంటే తెలంగాణ ధనిక రాష్ట్రం అయినప్పటికీ ఆ రాష్ట్రంలో సామాజిక పెన్షన్లు తక్కువగా ఇస్తున్నారని పేర్కొన్నారు. బాపట్ల జిల్లా కొత్తగొల్లపాలెంలో మంగళవారం జరిగిన పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. దేశంలోనే అత్యధికంగా వృద్ధులు, వితంతువులకు రూ.4 వేలు, దివ్యాంగులకు రూ.6 వేల చొప్పున సామాజిక పెన్షన్లు క్రమం తప్పకుండా చెల్లిస్తున్నామని చెప్పారు. తెలంగాణలో కొత్త ప్రభుత్వం వచ్చినా ఇప్పటికీ పాత పద్ధతిలోనే రూ.2 వేలు, దివ్యాంగులకు రూ.3 వేలు చెల్లిస్తున్నారని అన్నారు. వారసత్వంగా రూ.10 లక్షల కోట్ల అప్పు ఉన్నప్పటికీ అన్ని రకాల సంక్షేమ పథకాలను అమలు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్టు తెలిపారు.

గౌడన్నలకు కాంగ్రెస్ దగా!

- బార్ల కేటాయింపుల్లో రిజర్వేషన్లకు మంగళం
- ఎన్నికలప్పుడు గీతన్నలకు 25 శాతం ఇస్తామని హామీ
- తాజా నోటిఫికేషన్‌లో ఉన్న రిజర్వేషన్లు కూడా హుళక్కి

హైదరాబాద్, ఏప్రిల్ 1 (నమస్తే తెలంగాణ): మద్యం దుకాణాల కేటాయింపుల్లో గీత కార్మికులకు 25% రిజర్వేషన్లు అమలు చేస్తామంటూ కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని అమలు చేయకపోగా ఉన్న రిజర్వేషన్లను సైతం ఊడబీకిందని గీత కార్మిక సంఘాలు మండిపడుతున్నాయి. కేసీఆర్ ప్రభుత్వం అమలుచేసిన 15% రిజర్వేషన్లు సైతం లేకుండానే కాంగ్రెస్ ప్రభుత్వం కొత్త బార్లకు నోటిఫికేషన్ విడుదల చేసిందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. రిజర్వేషన్లను కూడా మింగేసిందని దళిత, గిరిజన సంఘాలు కూడా ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి.

కేసీఆర్ ప్రభుత్వం ఉన్నప్పుడు..

మద్యం దుకాణాల కేటాయింపుల్లో కేసీఆర్ ప్రభుత్వం గీత కార్మికులకు 15%, ఎస్సీలకు 10%, ఎస్టీలకు 5% చొప్పున రిజర్వేషన్లు అమలు చేసింది. ఇందుకోసం కేసీఆర్ ప్రభుత్వం ప్రత్యేక చట్టం తీసుకొచ్చి, ఎక్సైజ్ నిబంధనల్లో సవరణలు చేసి అమలు చేసింది. 2200 దుకాణాలు ఉండగా గీత కార్మికులకు 330 మద్యం దుకాణాలు, దళితులకు 220, గిరిజనులకు 110 చొప్పున కేటాయించింది. ఈ రిజర్వేషన్లతో కొన్ని చోట్ల గౌడ కుటుంబాలు వ్యక్తిగతంగా, చాలా చోట్ల గీత కార్మిక సొసైటీలు మద్యం దుకాణాలను సొంతం చేసుకున్నాయి. దళిత, గిరిజనులు కూడా మద్యం దుకాణాలను సొంతం చేసుకున్నారు. తదుపరి విడుదల చేసిన ప్రతి ఎక్సైజ్ నోటిఫికేషన్‌లో రిజర్వేషన్లు అమలు చేయాలని అప్పట్లో కేసీఆర్ ప్రభుత్వం నిర్ణయించింది.

ఉన్న రిజర్వేషన్లు ఊడబీకిన కాంగ్రెస్

ఎన్నికలకు మందు కాంగ్రెస్ గౌడ సామాజికవర్గానికి 25% రిజర్వేషన్లు అమలు చేస్తామని ప్రకటించింది. కానీ సీఎం రేవంత్‌రెడ్డి ఉన్న 15% రిజర్వేషన్లనే తొలిగించారని ఆరోపిస్తున్నారు. 25 బార్లకు కాంగ్రెస్ ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసిన విషయం తెలిసిందే. ఈ నోటిఫికేషన్‌లో తమకు 25 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తారని గీత కార్మికులు ఆశించారు. కానీ కేసీఆర్ అమలు చేసిన 15 శాతం రిజర్వేషన్లు కూడా తీసేసి ఓపెన్ నోటిఫికేషన్ విడుదల చేయడంతో గౌడ సామాజిక కుటుంబాలు నష్టపోయాయని గీత కార్మిక సంఘాలు ఆందోళన వ్యక్తంచేస్తున్నాయి. అట్లాగే దళితులకు కేటాయించిన 10శాతం, గిరిజనులకు కేటాయించిన 5 శాతం రిజర్వేషన్లు కూడా అమలు చేయకపోవటంతో దళిత, గిరిజన సంఘాలు కూడా ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ప్రభుత్వం విడుదల చేసిన నోటిఫికేషన్‌ను వెంటనే ఉపసంహరించుకొని, కనీసం కేసీఆర్ ప్రభుత్వం అమలు చేసిన రిజర్వేషన్లతోనైనా బార్లు కేటాయించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

గ్యాంగ్ రేప్ నిందితులను శిక్షిస్తాం

- ఏడుగురిని అరెస్ట్ చేశాం
- ఐజీ సత్యనారాయణ వెల్లడి

ఊర్కొండ, ఏప్రిల్ 1 : మహిళపై లైంగిక దాడికి పాల్పడిన వ్యక్తులను కఠినంగా శిక్షిస్తామని ఐజీ సత్యనారాయణ తెలిపారు. మంగళవారం ఆయన నాగర్‌కర్నూల్ జిల్లా ఊర్కొండపేటలో మహిళపై సామూహిక లైంగికదాడి జరిగిన ప్రదేశాన్ని ఎస్పీ వైభవ్ రఘునాథ్ గైక్వాడ్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఐజీ మాట్లాడుతూ.. గ్యాంగ్ రేప్‌కు పాల్పడిన నిందితులు ఏడుగురు పోలీసుల అదుపులో ఉన్నట్టు పేర్కొన్నారు. నిందితులకు క్రిమినల్ లా, పోక్సో వంటి చట్టాలపై అవగాహన ఉండటంతో మైనర్ల జోలికి వెళ్లకుండా, కేవలం ఫొటోలు తీసి బ్లాక్ మెయిల్ చేయడం, భయపెట్టి డబ్బుల వసూలు, నగలు గుంజుకోవడం వంటి పనులు చేశారని ఐజీ చెప్పారు. తెలివిగా ఆలోచిస్తూ వివాహితులను టార్గెట్ చేశారని తమ దర్యాప్తులో తేలిందని అన్నారు. ఆలయ ఉద్యోగితోపాటు ఆరుగురి ఫోన్ కాల్స్ లిస్టు పరిశీలిస్తున్నామని, మరో మూడు రోజుల్లో పూర్తి సమాచారం వెల్లడిస్తామని చెప్పారు. లైంగిక దాడి విషయంలో పూర్తి స్థాయిలో విచారణ జరుపుతున్నట్టు పేర్కొన్నారు. ఆలయానికి వచ్చే వారికి రక్షణ కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నేత రాకేశ్‌రెడ్డి

గ్రూప్-1 పేపర్లు రీవాల్యుయేషన్ చేయాలి

- గ్రూప్-1 నిర్వహణలో అన్నీ అవకతవకలే
- తెలుగు మీడియం అభ్యర్థులకు అన్యాయం
- సీఎం అశోక్‌నగర్ ఎందుకు రావడం లేదు
- బాధిత అభ్యర్థులకు బీఆర్ఎస్ పార్టీ అండ
- మీడియాతో బీఆర్ఎస్ నేత రాకేశ్‌రెడ్డి వెల్లడి

ఖైరతాబాద్, ఏప్రిల్ 1: టీజీపీఎస్సీ గ్రూప్-1 మెయిన్‌లోని అన్ని పేపర్లను రీవాల్యుయేషన్ చేయాలని బీఆర్ఎస్ నేత రాకేశ్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పరీక్షల నిర్వహణ, వాల్యుయేషన్‌లో జరిగిన తప్పిదాలను రాష్ట్ర ప్రభుత్వం సరిదిద్దుకోవాలని హితవు పలికారు. హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. గ్రూప్-1లో తెలుగు మీడియం అభ్యర్థులకు తీరని అన్యాయం జరిగిందని, మొత్తంలో 40 శాతం మంది ఉంటే టాప్-500లో కనీసం ఒక్క అభ్యర్థి కూడా లేకపోవడం దారుణమని పేర్కొన్నారు. దీంతో టీజీపీఎస్సీ ద్వారా తెలుగు మీడియంను చిన్నచూపు చూసిన చరిత్ర రేవంత్‌రెడ్డికే దక్కుతుందని విమర్శించారు. యూపీఎస్సీ ప్రమాణాలతో టీజీపీఎస్సీ పరీక్షలను నిర్వహిస్తామని చైర్మన్ చెప్పారని, వాటిని ఎక్కడా పాటించలేదని ధ్వజమెత్తారు. 45 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహిస్తే, కేవలం 10, 15 కేంద్రాల్లోని అభ్యర్థులే టాపర్లుగా నిలిచారని, మిగతా కేంద్రాల్లో ఎందుకు రాలేదని ప్రశ్నించారు. 18వ కేంద్రంలో 10 శాతం, సెంటర్-4లో 0.2 శాతం ఉత్తీర్ణత ఉన్నదని, ఈ వ్యత్యాసం ఎలా వచ్చిందని ప్రశ్నించారు. సెంటర్‌కో రీతిలో పేపర్ల మూల్యాంకనం జరిగిందని విమర్శించారు. ఏపీపీఎస్సీలో 6వేల పేపర్లు దిద్దడానికి 40 రోజులు తీసుకున్నారని, ఇప్పుడు 20 వేల పేపర్లను ఇంత తక్కువ సమయంలో ఎలా దిద్దారని ప్రశ్నించారు. ఒక్క పేపరు దిద్దడానికి కనీసం ఐదు నిమిషాలు కూడా తీసుకోలేదని తెలుస్తున్నదని పేర్కొన్నారు. మొత్తం గ్రూప్ పరీక్షల నిర్వహణే తప్పుల తడకగా జరిగినట్టు స్పష్టమవుతుందని ధ్వజమెత్తారు. అశోక్‌నగర్‌కు సీఎం రేవంత్ ఎందుకు రావడం లేదని ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డి చేసిన అన్యాయాన్ని అశోక్‌నగర్‌లోని ప్రతి హాస్టల్, ప్రతి కోచింగ్ సెంటర్ విద్యార్థి గుర్తు పెట్టుకుంటారని, తగిన సమయంలో గుణపాఠం చెప్తారని హెచ్చరించారు. అన్యాయం జరిగిన అభ్యర్థుల పక్షాన బీఆర్ఎస్ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. సమావేశంలో తెలంగాణ ఉద్యమకారుడు తెలంగాణ విఠల్, తెలంగాణ క్రాంతిదళ్ అధ్యక్షుడు పృథ్వీరాజ్, ఉద్యమ నేతలు జనార్ధన్, మోతీలాల్ తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్-1 టాపర్లు ఒకే గదిలో!

మొదటిపేజీ తరువాయి...

పరిశీలిస్తే అనేక లొసుగులు వెలుగు చూస్తున్నాయి. గ్రూప్-1 టాపర్లంతా ఒకే గదిలో పరీక్ష రాసినట్టు వెల్లడవుతున్నది. 500కు పైగా మార్కులొచ్చిన వారంతా ఒకే గదిలో పరీక్ష రాసిన వారిగా తేలతెల్లమైంది. మెరిట్ మార్కులు, హాల్‌టికెట్ నంబర్లను పరిశీలిస్తే ఒకే గదిలో పరీక్ష రాసిన వారికి ఒకటి రెండు తేడాలతో మార్కులు ఉండటం గమనార్హం. టాపర్లుగా నిలిచిన ముగ్గురు అభ్యర్థులు ఒకే గదిలో పరీక్ష రాశారని ఇతర అభ్యర్థులు గగ్గోలు పెడుతున్నారు. ఇదంతా ఒక పద్ధతి ప్రకారం జరిగిందని, మొత్తంగా గ్రూప్-1లో భారీ స్కామ్ జరిగిందని అభ్యర్థులు ఆరోపిస్తున్నారు. ఈ కుంభకోణం వెనుక ప్రభుత్వ పెద్దల హస్తం ఉన్నదని, ఈ కుంభకోణంపై జ్యుడీషియల్ విచారణ జరపాలని పలువురు అభ్యర్థులు డిమాండ్ చేస్తున్నారు.

రెండు నంబర్ల తేడాతో సేమ్ మార్కులు

టీజీపీఎస్సీ ప్రకటించిన గ్రూప్-1 జీఆర్ఎల్ చూస్తే వరుసపెట్టి మార్కులేశారా? అన్న అనుమానం కలుగుతున్నది. ప్రతి రెండు హాల్‌టికెట్ నంబర్లకు సేమ్ మార్కులు వేశారు. రెండు హాల్‌టికెట్ నంబర్ల తేడాతో 44 మందికి ఒకే మార్కులు రావడం గమనార్హం. వీరంతా మెరిట్ జాబితాలోనే ఉన్నారు. ఎన్ని కోణాల్లో చూసినా ఇలా ఉండటానికి ఆస్కారమే లేదు. కానీ ఇదంతా ఒక పద్ధతి ప్రకారం ఉండటం గమనార్హం. 370 వరకు మార్కులొస్తే గ్రూప్-1 ఉద్యోగాలొస్తాయన్న అంచనాలు ఉన్నాయి. కావాలనే ఇలా పేపర్లను శాస్త్రీయంగా దిద్దకుండా ఇష్టారీతిన కొంతమందికి పోస్టులు కట్టబెట్టడంలో భాగంగా మార్కులు వేశారని ఆరోపిస్తున్నారు.

వరుసపెట్టి మార్కులేశారిలా!

ఒక పరీక్ష కేంద్రంలో '366(చివరి నంబర్లు) హాల్‌టికెట్ నంబర్ గల అభ్యర్థికి 436 మార్కులు, ముందు అభ్యర్థి (హాల్‌టికెట్ నంబర్ 367)కి 438 మార్కులు వచ్చాయి. మరో చోట 732 నంబర్ గల అభ్యర్థికి 425 మార్కులు, 733 నంబర్‌కు 425.5 మార్కులు.. ఇలా ఒకరి తర్వాత మరొకరు పరీక్ష రాస్తే 0.5 మార్కులు తేడాతో వేశారు. వరుసగా హాల్‌టికెట్ నంబర్లు, వరుసపెట్టి మార్కులు. ముందు బెంచీ వాళ్లకు వచ్చిన మార్కులకు, తర్వాత బెంచీ వాళ్లకు ఒకటి లేదా రెండు మార్కుల తేడాలతో వచ్చాయి. ఇదంతా చూస్తుంటే నిజంగా గ్రూప్-1 మెయిన్స్ ఆన్సర్ షీట్లు మూల్యాంకనం చేశారా? లేక వరుసపెట్టి మార్కులు వేశారా? యావరేజ్‌గా హాల్‌టికెట్ నంబర్లను బట్టి మార్కులు వేసుకుంటూ పోయారా? అన్న అనుమానాలు కలుగుతున్నాయి. గ్రూప్-1 మెయిన్స్ పేపర్ల మూల్యాంకనం ఎంత లోపభూయిష్టంగా జరిగిందో ఈ ఉదాహరణే నిదర్శనంగా నిలుస్తున్నది. ఒకరు కాదు ఇద్దరు కాదు.. దాదాపు 360 మంది అభ్యర్థులకు ఇలాగే జరిగింది.

రెండు నెలల్లోనే పూర్తి

గ్రూప్-1 మెయిన్స్‌ను 21 వేల మంది రాశారు. ఒక్కో అభ్యర్థి 7 పేపర్లకు పరీక్షలు రాశారు. అంటే 1.47 లక్షల సమాధాన పత్రాలు ఉంటాయి. జవాబు పత్రాలను ఇద్దరు వాల్యుయేటర్ల చేత మూల్యాంకనం చేయించారు. ఇద్దరు మూల్యాంకనం చేసిన తర్వాత మార్కుల్లో 15 శాతం తేడాలు ఉంటే మూడోసారి మూల్యాంకనం చేస్తారు. గతంలో ఏపీలో నిర్వహించిన గ్రూప్-1 మెయిన్స్ మూల్యాంకనానికి మూడు నెలలు పట్టింది. అప్పట్లో అభ్యర్థులు 6 వేల మందే. కానీ ఇప్పుడు 21 వేల మంది పేపర్ల మూల్యాంకనం రెండు నెలల్లోనే పూర్తి అయ్యింది. ఇది ఎలా సాధ్యమని అభ్యర్థులు ప్రశ్నిస్తున్నారు. ఇష్టారీతిన మార్కులేసి, ప్రతిభావంతులకు అన్యాయం చేశారని మండిపడుతున్నారు.

ఆన్సర్ షీట్లు బ